ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం అక్టోబరు 24, 2024

సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్.వి.పాటిల్

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులకు సేంద్రియ ఎరువుల ప్రాధాన్యంపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. ఏడో విడత 'దేశీ' శిక్షణను పూర్తిచేసుకున్న ఎరువులు, పురుగు మందుల డీలర్లకు చుంచుపల్లి మండలం రామవరం రైతువేదికలో బుధవారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్.. పంటలపై వాతావరణ పరిస్థితుల ప్రభావం, భూసార పరిరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులపై డీలర్లకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను, సేంద్రియ పద్ధతులను అన్నదాతలకు తెలియపర్చాలన్నారు. అధికాదాయాన్నిచ్చే మునగ, కూరగాయల పంటల సాగు దిశగా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బాబురావు, 'దేశీ' ఫెసిలిటేటర్, రిటైర్డ్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.డేవిడ్ జయపాల్, చుంచుపల్లి, జూలూరుపాడు వ్యవసాయాధికారులు బి.రాజేశ్వరి, దీపక్ ఆనంద్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్


కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు బుధవారం ధర్నా చేపట్టారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ఫహీమ్‌దాదా మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. ఈనెల 27వ తేదీలోగా స్పందించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్, షాహీద్, వంశీ, పవన్‌సాయి, సృజన్, వినయ్, నాగేంద్రబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

పౌర సేవ.. ఇదే సత్వర తోవ..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం



పౌరులకు వివిధ రకాల సేవలను సంబంధిత గ్రామ పంచాయతీల్లోనే అందించేలా కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ఇతర సేవలన్నింటినీ పంచాయతీ కేంద్రంగా అందుబాటులోకి తీసుకురావటానికి సిటిజన్ చార్టర్ 2.0 అమలుచేయాలని భావిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నా గ్రామ పంచాయతీలు దాన్ని అందిపుచ్చుకోవటం లేదని కేంద్రం గుర్తించింది. పౌరసేవల్లో 28శాతం మాత్రమే ఆన్‌లైన్ ద్వారా మిగతా 72శాతం ఆఫ్‌లైన్‌లోనే ప్రజలకు అందుతుండటంతో పారదర్శకత ప్రశ్నార్థకమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి పల్లెలో ఆన్‌లైన్ ద్వారా పౌరసేవలను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అందించేందుకు కేంద్రం నడుం బిగించింది.

క్లస్టర్ల వారీగా సంక్లిష్టం..!

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గ్రామ పంచాయతీలను క్లస్టర్ల వారీగా విభజించి పౌరసేవలు అందిస్తున్నారు. మేజర్ పంచాయతీలైతే రెండు, చిన్నవైతే మూడు నుంచి నాలుగింటిని కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్లకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుని పంచాయతీ నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆయా క్లస్టర్ ఆపరేటర్లు మండల కార్యాలయంలోనే ఉంటూ సేవలందిస్తుండటంతో ప్రజలతో పాటు పంచాయతీ కార్యదర్శులు సైతం తమ అవసరాల కోసం తప్పనిసరిగా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీల్లో అందాల్సిన సేవలు మండల కేంద్రానికి తరలిపోవటంతో ప్రజలకు కష్టమవుతోంది.

పారదర్శకతకు ప్రాధాన్యం

సిటిజన్ చార్టర్ 2.0 అమలైతే ప్రతి గ్రామ పంచాయతీలో పౌరులకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,070 పంచాయతీల్లో కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశుద్ధ్యం, ఇంటిపన్ను వసూలు, గ్రామసభల నిర్వహణ, జనన, మరణ ధ్రువపత్రాల జారీ వంటి సుమారు 34 రకాల సేవలందిస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు పంచాయతీ దస్త్రాల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా అందించటం వల్ల అవకతవకలకు ఆస్కారమేర్పడుతోంది. డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే పారదర్శకత పెరుగుతుంది.

డిజిటలీకరణతో సమస్యల పరిష్కారం

ఉభయ జిల్లాల్లో అనేక గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవు. డిజిటలీకరణలో భాగంగా పక్కా భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. గిరిజన జనాభా అధికంగా నివసించే భద్రాద్రి లాంటి జిల్లాల్లో డిజిటల్ సేవలందించాలంటే సిగ్నల్ వ్యవస్థను పటిష్ఠపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత్ నెట్‌వర్క్ లేదా రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌తో ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలి. వీటితో పాటు ప్రతి గ్రామ పంచాయతీకి ఒకరి చొప్పున కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమిస్తారు లేదా ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ ఇస్తారు.

గ్రామ పంచాయతీల్లో డిజిటలీకరణ వల్ల పౌరులకు సత్వర సేవలందించేందుకు అవకాశముంటుంది. ప్రస్తుతం క్లస్టర్ల వారీగా సేవలందిస్తున్నప్పటికీ అవి మండల కార్యాలయానికే పరిమితమవుతున్నాయి. అందుకే సేవల్లో జాప్యం జరుగుతోంది. - చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

మార్కెట్ కమిటీ పదవులపై గంపెడాశలు

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే



కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో చోటుపై అధికార పార్టీ సీనియర్ నాయకులు పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు గట్టిగా చేస్తున్నారు. వీరిలో కొందరు హస్తాన్ని ఏళ్లుగా అంటిపెట్టుకుని వస్తున్న వారున్నారు. మరికొందరు ఎన్నికల సమయంలో, ఫలితాల తర్వాత కాంగ్రెస్ గూటికి చేరిన వారూ ఉన్నారు. ఎవరి ప్రయత్నం ఫలించి పదవి వరిస్తుందో వేచిచూడాల్సిందే.

జిల్లాలో మొత్తం ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. అవి.. కొత్తగూడెం, ఇల్లెందు, దమ్మపేట, బూర్గంపాడు, చర్ల, భద్రాచలం. వీటిలో ఇల్లెందు, దమ్మపేట మార్కెట్ కమిటీల పాలకవర్గం ఎంపికపై ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. మిగతా చోట్ల కమిటీల ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం మార్కెట్ కమిటీల ఛైర్మన్ పదవులు ఎస్టీ మహిళలకు రిజర్వు అయ్యాయి. మిగతా వాటిని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. పాలకవర్గం పూర్తి పదవీ కాలం రెండేళ్లు.

అటు హస్తం.. ఇటు సీపీఐలో ఆశావహులు

కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పదవిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మార్కెట్ కమిటీ పదవులపై ఆ పార్టీ నాయకులు సైతం ఆశలు పెట్టుకొన్నారు. మరోవైపు అధికార పార్టీ కాంగ్రెస్‌లో పాత, కొత్త నాయకులు ఎవరికి వారు ఛైర్మన్ పదవులపై గంపెడాశలు పెట్టుకొన్నారు. కొన్నేళ్లుగా పార్టీ మారకుండా జెండా మోస్తున్న నాయకులు ఈసారి కనీసం మార్కెట్ కమిటీలోనైనా చోటు కల్పించాలని మంత్రుల ద్వారా రాష్ట్ర అధిష్ఠానంపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. పలువురు ఉమ్మడి జిల్లా మంత్రులను కలిసి తమ ఆవేదన వెళ్లగక్కినట్లు తెలిసింది. త్వరలో పాలకవర్గం ఎంపిక జరుగుతుందనే సమాచారంతో ఎవరి ప్రయత్నాల్లో వారు తలమునకలయ్యారు.

ఇప్పటివరకు ఇద్దరు ఛైర్మన్లు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగూడెం వ్యవసాయం మార్కెట్ కమిటీకి తొలి ఛైర్మన్‌గా మాళోత్ హరిలాల్ ఎంపికయ్యారు. ఆయన 2016 సెప్టెంబరు 21 నుంచి 2018, సెప్టెంబరు 20వ తేదీ వరకు పనిచేశారు. ఆ తర్వాత భూక్యా రాంబాబు 2021 మే 29 నుంచి 2023 వరకు పూర్తి పదవీకాలం పనిచేశారు. ప్రస్తుతం మూడోసారి పాలకవర్గం ఎంపిక కానుంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే మనందరి లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. కొత్తగూడెంలోని చిన్నబజార్, పెద్దబజార్‌లోని దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో కార్మికశాఖాధికారి మహ్మద్ షరీపుద్దీన్, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు చేపట్టారు. 14ఏళ్లలోపు పిల్లలను పనిలో నియమిస్తే చట్టప్రకారం యజమానిపై కేసు నమోదు చేస్తామని భానుమతి హెచ్చరించారు. పెద్దబజార్‌లోని రాయల్ కిరాణా దుకాణంలో బాలకార్మికుడిని గుర్తించి అతడి వివరాలు సేకరించారు.


వస్త్ర దుకాణాన్ని తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి జి.భానుమతి

జీవితాన్ని చదువు.. చాలించొద్దు తనువు


కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

★ బుద్ధిగా చదువుకో అమ్మా.. అసలే నాన్న లేడు. నేను కూలీ పని చేస్తేనే మన కుటుంబం గడిచేది. నువ్వు ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో స్థిరపడితే నీ బతుకు బాగుంటుంది. మనలాంటి పేదవాళ్లకు చదువే ఆధారం కదా..! అని నాలుగు మంచి మాటల చెప్పిన ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. చదువు విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని తల్లి చెబితే సుజాతనగర్ మండలానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది.

'తల్లిని అర్థం చేసుకొని చదువుపై దృష్టి సారిస్తే బాలిక భవిష్యత్తు బంగారంలా ఉండేది. ఆ తల్లికి ఆసరాగా నిలిచేది.'

★ టేకులపల్లి మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక తన స్నేహితులతో కలిసి బయటికి వెళ్లాలనుకుంది. ఇప్పుడే స్నేహితులతో కలిసి బయటి కార్యక్రమాలకు వెళ్లటం ఎందుకమ్మా..? అని ఆమె తల్లి కాస్త మందలించింది. ఆ మాటతో బాలిక తనకు తానే మరణశాసనం రాసుకుంది. క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కన్న తల్లికి కడుపుకోత మిగిల్చింది.

"తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి ప్రాణాలు తీసుకోవటం కంటే కని పెంచుతున్న వారి మాటను గౌరవించడం మేలు అనే చిన్న ఆలోచన బాలికకు తట్టి ఉంటే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండేది కాదేమో కదా..!"



జిల్లాలో విద్యార్థుల బలవన్మరణాల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. సమస్యకు పరిష్కారం అన్వేషించే తత్వాన్ని కోల్పోయి క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, చక్కటి ఆలోచనాశక్తి కలిగిన స్నేహితులతో తమ మనోభావాలను పంచుకుంటే ఇలాంటి పరిస్థితులను అవలీలగా అధిగమించవచ్చునని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.



ప్రతి ప్రశ్నకు జవాబు ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారమూ లభిస్తుంది. ఇది గమనించకుండా విద్యార్థుల నుంచి అన్నీ తెలిసిన వ్యక్తుల వరకు బలవన్మరణాలే శరణ్యమనుకోవటం బాధాకరం. చిన్నచిన్న సమస్యలను తల్లిదండ్రులకు చెప్పుకొంటే ఇట్టే పరిష్కారమవుతాయి. తల్లిదండ్రులతో చనువు లేని పరిస్థితులుంటే కుటుంబ సభ్యులు, బంధువుల్లో ఆత్మీయంగా వ్యవహరించే వారుంటారు. అలాంటి వారి సలహాలు, సూచనలు తీసుకుని సమస్యలను పరిష్కరించుకునేందుకు బాటలు వేసుకోవాలి. - బి.రోహిత్‌రాజు, ఎస్పీ



తల్లిదండ్రులు పిల్లలను కనిపెట్టుకుంటూ ఉండాలి. వారి ప్రవర్తనలో ఏమాత్రం తేడా కనిపించినా జాగ్రత్త వహించాలి. అతిగా ఆందోళన పడుతున్నట్లు అనిపించినా, ఒంటరితనాన్ని ఇష్టపడుతున్నా, ఏవిషయంపైనా ఆసక్తి కనబరచకపోయినా, ప్రతి దానికీ భయపడుతున్నా.. తీవ్రంగా పరిగణించాలి. కోపం ప్రదర్శించకుండా వారి బాధను తెలుసుకునేందుకు యత్నించాలి. సాంత్వన కలిగించేలా మాట్లాడుతూ వారికి భరోసా కల్పించాలి. అలాంటప్పుడే అవతలివారు ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటికొస్తారు. - జువ్వాది వెంకటేశ్వరబాబు, మానసిక నిపుణుడు

వసతిగృహ సంక్షేమాధికారిపై వేటు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణం అంబేడ్కర్ కూడలి సమీపంలోని గిరిజన బాలుర వసతిగృహం(ఎస్టీబీహెచ్) సంక్షేమాధికారి ఎన్.తిరుమలరావును ఐటీడీఏ పీఓ రాహుల్ సస్పెండ్ చేశారు. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులో వచ్చింది. సదరు సంక్షేమాధికారి వసతిగృహంలో అందుబాటులో ఉండకుండా, విద్యార్థులకు కావాల్సిన ఆహారాన్ని అందించడంలో అలసత్వం వహిస్తున్నారని కొందరు వాట్సాప్ ద్వారా ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన్ను సస్పెండ్ చేస్తూ సోమవారమే ఆదేశాలు వెలువడ్డాయి. అప్పటివరకు ప్రత్యామ్నాయంగా వేరొకరికి బాధ్యతలు అప్పగించాలని ఏటీడీఓ చంద్రమోహన్‌ను పీఓ ఆదేశించారు. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సంక్షేమాధికారి సస్పెన్షన్‌ను ధ్రువీకరించారు. విచారణ అనంతరం సమగ్ర నివేదికను పీఓకు అందజేస్తామన్నారు.

ఎవరేమన్నుకున్నా తవ్వటమే..!

పాల్వంచ, న్యూస్‌టుడే

మైనింగ్ కోర్సులు బోధించే కొత్తగూడెం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (మైనింగ్) భూముల్లోని ఖనిజాలకే రక్షణ కరవైంది. స్వయం ప్రతిపత్తితో (అటానమస్) ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థకు 389.62 ఎకరాల్లో భూములు ఉన్నాయి. వీటికి కనీసం కంచె కూడా లేదు. కాపలాదారులను నియమించుకుని వేతనాలు చెల్లించేందుకు వనరులు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదనుగా కబ్జా చేసిన భూముల్లో విలువైన ఖనిజాలను కొందరు లూటీ చేస్తున్నారు. విలువైన వృక్షాలు, రాళ్లూ తరలిపోతున్నాయి.


కళాశాల భూముల్లో ఎర్రమట్టి తరలించగా ఏర్పడిన భారీ గోతులు


ఎకరాల కొద్దీ ఎర్రమట్టి, రాళ్ల తరలింపు

జగదల్‌పూర్-విజయవాడ జాతీయ రహదారి మార్గం వెంట ఈ విద్యాసంస్థకు కేటాయించిన భూముల్లో ఎర్రమట్టి విస్తారంగా ఉంది. భవనాలు, రోడ్ల నిర్మాణం, స్థిరాస్తి వెంచర్లకు వినియోగించేందుకు కొందరు ఇక్కడి నుంచే రాత్రింబవళ్లు ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పు మట్టి రూ.3వేల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భవనాల పునాదులు, రోడ్ల నిర్మాణంలో వాడే క్రషర్ మిక్స్‌కు ఉపయోగించే రాళ్లనూ ఇక్కడి నుంచి తరలిస్తూ రూ.వేలల్లో ఆర్జిస్తున్నారు. ఇలా కళాశాల స్థలంలో వనరులను దోపిడీ చేస్తున్నా అడ్డుకునేవారు కరవయ్యారని ఇక్కడి సిబ్బంది వాపోతున్నారు. కళాశాలకు చెందిన భవనాలు, వసతిగృహాలన్నీ కలిపి పదెకరాల విస్తీర్ణంలోనే ఉన్నాయి. మిగిలిన విస్తీర్ణంలో దట్టమైన అడవి విస్తరించింది. ఆ ప్రాంతంలోని మట్టిని రాత్రింబవళ్లు కొందరు తవ్వేస్తున్నారు. కొన్నిచోట్ల 20 అడుగుల లోతున గోతులు పడ్డాయి. భవిష్యత్తులో కళాశాలను విస్తరించాల్సి వస్తే గోతులను పూడ్చడానికి రూ.కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. టేకు, నీలగిరి, వేప, మద్ది తదితర జాతుల వృక్షాలను అక్రమార్కులు నరికేసి కలపను తరలించుకుపోతున్నారు.

ఖనిజ సంపద తరులుతోందని కళాశాల తరఫున ఓ సెక్యూరిటీ గార్డును నియమించాం. ప్రత్యేకంగా ట్రెంచ్ కొట్టించాం. అయినా కొందరు అక్రమంగా మట్టి, రాళ్లు, ఇతర వనరులను తరలించుకుపోతున్నారు. ఈవిషయాన్ని కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. - జగన్‌మోహన్‌రాజు, మైనింగ్ కళాశాల ప్రిన్సిపల్

రిజర్వేషన్ల దామాషాపై అభ్యర్థనల స్వీకరణ

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై అభ్యర్థనలు, అభ్యంతరాలు, సలహాలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖాధికారి ఇందిర బుధవారం తెలిపారు. 'వెనుకబడిన తరగతులు, సంచార జాతుల సమగ్ర కులగణ సర్వే' ఆధారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషా పద్ధతిని పేర్కొనేందుకు రాజకీయ పార్టీల నుంచి సలహాలు , సూచనలు ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో బహిరంగ విచారణలు నిర్వహించాలని ఈ నెల 17న జరిగిన ఓ సమావేశంలో కమిషన్ తీర్మానించిందన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వెనుకబడిన కులాల సభ్యుల పెద్దలు వెరిఫికేషన్ అఫిడవిట్‌ను నవంబరు 5 నాటికి కలెక్టరేట్ పనివేళల్లో అందజేయాలని సూచించారు.



ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని అరుంధతీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఎంఈవో స్వర్ణ జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసి అరటి పండు తిన్న పది నిమిషాల వ్యవధిలో నాలుగో తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులు, రెండోతరగతికి చెందిన ఇద్దరు.. మొత్తం ఏడుగురు వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు తక్షణమే ఆ విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కోలుకున్న ఆరుగురు విద్యార్థులను ఇంటికి పంపించారు. ఒక విద్యార్థిని మాత్రం గత మూడ్రోజులుగా జ్వరంతో బాధపడుతున్నందున ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ మజ్నేకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విద్యార్థుల అస్వస్థత గురించి పరిశీలిస్తున్నామని, ఫుడ్ పాయిజన్ జరిగిందా? లేదా? అనే విషయం కచ్చితంగా చెప్పలేమన్నారు. ఇదే పాఠశాలలో గతంలోనూ విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భముంది. ఈ పాఠశాలలోనే ఎందుకిలా జరుగుతుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కౌలు రైతుపై ఆంక్షల కత్తి!


ఈటీవీ, ఖమ్మం: భూములకు రూ.వేలకు వేలు కౌలు చెల్లించటమే కాకుండా పంటల సాగుకు రూ.లక్షల పెట్టుబడులు పెట్టిన కౌలుదారులు.. చివరకు రెక్కల కష్టాన్ని అమ్ముకునేందుకూ అవస్థలు పడుతున్నారు. ఈసారి ప్రకృతి విపత్తులతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. కొద్దోగొప్పో చేతికొచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అవసరం. వీటిని ఇచ్చేందుకు అనేకచోట్ల భూయజమానులు ససేమిరా అంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు పత్తి విక్రయించి కౌలుదారులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు.



ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం జిల్లాలో 1.09 లక్షల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.10 లక్షల మంది రైతులు ఈసీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. వీరిలో లక్ష మందికి పైగా కౌలుదారులు ఉంటారు. పత్తి సాగుకు కర్షకులు అత్యధికంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. దీనికి తోడు భూమి కౌలుధర ఏటికేడు పెరుగుతోంది. ఎకరా పత్తిసాగుకు సుమారు రూ.50వేల వరకు ఖర్చవుతుంది. ఆరుగాలం కష్టపడినా ఈసారి ప్రకృతి విపత్తులు, తెగుళ్ల దెబ్బతో పత్తి పంటలు తెల్లబోయాయి. గతంలో ఎకరాకు 10-15 క్వింటాళ్ల దిగుబడులు వస్తే ఈసారి ఆరు క్వింటాళ్లకు మించలేదు. చివరకు చేతికొచ్చిన ఆశల పంటను అమ్ముకుందామంటే.. వెంటాడుతున్న ఆంక్షల కత్తి కౌలుదారుల పాలిట శాపంగా మారుతోంది. ప్రైవేటు మార్కెట్‌లో కన్నా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కాసింత ఆశాజనకంగానే పత్తికి ధరలు పలుకుతున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు ధర రూ.7,521 లభిస్తోంది. ఖమ్మం జిల్లాలో తొమ్మిది, భద్రాద్రి జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాటుచేశారు. వీటిలో పత్తి విక్రయించాలంటే రైతు ఆధార్ కార్డు, పట్టాదారు, బ్యాంకు పాసుపుస్తకం తప్పనిసరి అనే నిబంధన ఉంది. దళారుల కట్టడి కోసం క్షేత్రస్థాయిలో ఏ పంటలను ఎంత విస్తీర్ణంలో ఎవరు పండిస్తున్నారనే వివరాలను వ్యవసాయశాఖ విస్తరణాధికారులు ఆన్‌లైన్‌లో గతంలోనే నమోదుచేశారు. కౌలురైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరే నిక్షిప్తపరిచారు. వ్యవసాయశాఖ పోర్టల్‌లో పంట సాగుచేసినట్లు ఎవరి పేరుంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సరకును కొంటారు. కౌలుదారులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించాలంటే పట్టాదారు ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో వెళ్లాలి. ఇందుకు అనేకచోట్ల పట్టాదారులు అంగీకరించటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కౌలుదారులు తమ సరకును కనీస మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులకే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించాలంటే భూయజమాని ఆధార్ కార్డు, పాసుపుస్తకం ఉండాలి. ఇవి లేనిపక్షంలో స్థానిక వ్యవసాయ విస్తరణాధికారుల సంతకంతో కూడిన ధ్రువపత్రం అందించినా సరకు కొనాలని సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించాం. - అలీం, డీఎంఓ, ఖమ్మం



పంటల డిజిటల్ సర్వేకు సరే..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం: నెల రోజులుగా పంటల డిజిటల్ సర్వేపై కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడింది. హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ సంచాలకుడితో బుధవారం జరిగిన సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) ఓ అంగీకారానికి వచ్చారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సర్వేలో పాల్గొంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ మొదటికి

పనిభారం ఎక్కువవుతోందని, డిజిటల్ సర్వే చేయలేమని రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది ఏఈఓలు ప్రభుత్వానికి కొంతకాలంగా తేల్చిచెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సహాయ సిబ్బందిని నియమిస్తేనే సర్వే చేస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ సంచాలకుడితో చర్చల అనంతరం పంటల డిజిటల్ సర్వే చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే సర్వేను నిలిపేస్తామంటున్నారు.



జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఏఈఓలు
ఖమ్మం	5.80 లక్షలు	129
భద్రాద్రి	5.76 లక్షలు	67

ఇన్నాళ్లు ప్రతిష్టంభనకు కారణమేంటి..?

భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంట ఉత్పత్తుల కొనుగోలు, సాగు ప్రణాళిక తదితరాలకు పంటల డిజిటల్ సర్వే ఆధారం కానుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని తీసుకొచ్చింది. దీని అమలుకు ఆయా రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. ఈ పథకంలో భాగంగా చేపట్టే పంటల సర్వేకు స్థానిక యువతను ఉపయోగించుకుని ఉపాధి కల్పించాలని సూచించింది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏఈఓల ద్వారానే సర్వే చేయించాలని చూస్తుండటంతో సమస్య ఉత్పన్నమైంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో వేల ఎకరాల భూమి సాగవుతోందని, సహాయకులు లేకుండా సర్వే చేయటం సాధ్యం కాదని ఏఈఓలు మొండికేయటంతో ఇన్నాళ్లు ప్రతిష్టంభన నెలకొంది.

రెగ్యులర్ ఏఈఓలు సైతం..

వర్షాకాలం పంటల వివరాల నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసిన ఏఈఓలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పంటల డిజిటల్ సర్వే ఇబ్బందిగా మారింది. ఆయా క్లస్టర్ల పరిధిలో రైతులు సాగు చేసిన పంట పొలాలకు సంబంధించి ప్రతి గుంటను లెక్కించి ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తపరచాల్సి రావడంతో తాము ఈ పని చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేశారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పని చేస్తున్న ఒప్పంద సిబ్బందిపై భారం పడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందేమోననే ఆందోళనలో ఒప్పంద సిబ్బంది సర్వే మొదలుపెట్టారు. ఇప్పుడు మూడు రోజుల పాటు సర్వే చేపట్టడానికి రెగ్యులర్ ఏఈఓలు అంగీకరించారు.

మూడు రోజుల పాటు సర్వే నిర్వహించిన తర్వాత ఏఈఓలకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వ్యవసాయశాఖ సంచాలకుడు హామీ ఇచ్చారు. ఈమేరకు గురువారం నుంచి పంటల డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. తదనంతరం ఏఈఓల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుంటే మళ్లీ ఐక్య కార్యాచరణతో ముందుకెళ్తాం.
- నర్సింహారావు, ఏఈఓల ఐకాస జిల్లా అధ్యక్షుడు, భద్రాద్రి కొత్తగూడెం

పిడుగు గుట్టు.. ప్రాణం నిలబెట్టు

చుంచుపల్లి, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో పిడుగుపాటు ఘటనలు ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్నాయి. కేవలం రెండ్రోజుల వ్యవధిలో రైతు కుటుంబాలకు చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉభయ జిల్లాల్లో పిడుగుపాటు మరణాలు ఏటా పదుల సంఖ్యలో సంభవిస్తున్నాయి. పలు ఘటనల్లో మూగజీవాలు ఎక్కువ సంఖ్యలో చనిపోతున్నాయి. రెప్పపాటులో సంభవించే పిడుగుపాటును ముందే పసిగట్టవచ్చన్నది వాతావరణ శాస్త్రవేత్తల సూచన. అవగాహన కొరవడటం వల్లే చాలామంది రైతులు, వ్యవసాయ కూలీలు చనిపోతున్నట్లు వారు చెబుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ భాగం అటవీ విస్తీర్ణం, ఎత్తైన కొండలు, గుట్టలను కలిగి ఉంది. ఆయా ప్రాంతాల్లో సహజంగానే పిడుగులు పడుతుంటాయి. సముద్ర తీరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో విచ్ఛిన్నత అధికమైన వాతావరణంలో పిడుగులు పడే ప్రమాదం ఎక్కువని పరిశోధకులు చెబుతున్నారు. ఈ కారణంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎక్కువగా పిడుగుపాటు ఘటనలు సంభవిస్తున్నాయి. ఇలాంటప్పుడు వాతావరణం మార్పులను బట్టి జాగ్రత్తపడటం, పొంచిఉన్న ప్రమాదాన్ని యాప్‌ల సాయంతో పసిగట్టడం ద్వారా ప్రాణాల్ని కాపాడుకోవచ్చు.



ఈ జాగ్రత్తలే రక్ష: సుమన్, కేవీకే వాతావరణ విభాగం పర్యవేక్షకుడు

ఉరుములు, మెరుపులప్పుడు ఎత్తైన ప్రదేశాల్లో, చెట్ల కింద, భవనాలపై, వెల్లడిగా ఉండే మైదాన ప్రదేశాల్లో ఉండకూడదు. విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, లోహపు పనిముట్లు, వ్యవసాయ పంపుసెట్లకు దూరంగా ఉండాలి. శరీరం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లోని లోహపు వస్తువులు ఊగుతున్నా అది పిడుగుపాటు సంకేతంగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే మోకాళ్ల మధ్య తల ఉంచి కూర్చొని, రెండు చేతులతో చెవులు మూసుకోవాలి. అటవీ ప్రాంతంలో ఉన్నట్లయితే మరుగుజ్జు, చిన్నగా ఉన్న చెట్లకింద మాత్రమే కూర్చోవాలి. మెరుపులు బాగా వచ్చేటప్పుడు ఇంట్లోని సభ్యులంతా ఒకేచోట కూర్చోవద్దు. దూరందూరంగా ఉంటే ప్రమాద తీవ్రత తగ్గుతుంది. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉపకరణాల ప్లగ్‌లను తీసి ఉంచాలి. సెల్‌ఫోన్‌ను ఉపయోగించొద్దు. ఉరుముల సమయంలో స్నానాలు చేయొద్దు. ప్రయాణ సమయంలో కార్లలోంచి కిందకు దిగొద్దు. తడి కంటే పొడి ప్రదేశంలో ఉండటం మంచిది. నీళ్లల్లో ఉంటే సాధ్యమైనంత త్వరగా బయటకు రావాలి.



ప్రాణ, ఆస్తినష్టం అపారం..

మీకు తెలుసా?

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని మరొకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుని ఉపరితల శక్తి కన్నా చాలా రెట్లు ఎక్కువని పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేలవైపునకు చేర్చుతుంది. ఒక పిడుగుతో 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అందుకే అపార ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తాయి.

ప్రమాదాన్ని ముందే గుర్తించొచ్చు..

ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో భారత వాతావరణ విభాగం (ఐఎండీ), భూశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎస్) ముందే హెచ్చరిస్తోంది. ఇందుకోసం damini lighting alert అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. మొబైల్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, లేదా యాపిల్ యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్ కోడ్ వంటి వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి చుట్టూ 40 కిలో మీటర్ల పరిధిలో ఒక సర్కిల్ యాప్‌లో కనిపిస్తుంది. పిడుగు ఎంత సేపట్లో పడుతుంది అనే హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలంరంగు) సూచిస్తారు.



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కొణిజర్ల పోలీసు స్టేషన్ విధుల్లో ఉన్న 2000 బ్యాచ్ హెడ్ కానిస్టేబుల్ ఈ.లోకేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న తోటి బ్యాచ్ సిబ్బంది తమవంతు సాయంగా రూ.2 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే ఆప్తమిత్రునికి వారంతా అండగా నిలిచి పిల్లల భవితకు భరోసా కల్పించారు. వారిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

అన్నం ఆశ్రమానికి 10 క్వింటాళ్ల బియ్యం వితరణ

ఖమ్మం అర్బన్: నగరంలోని అన్నం సేవాశ్రమానికి రోటరీనగర్ వాసవి క్లబ్ సభ్యుడు కేసా సత్యం 10 క్వింటాళ్ల బియ్యం వితరణగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, వాసవీ క్లబ్ సభ్యులు సోమా శేషగిరిరావు, హన్మంతరావు, వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, రమేశ్, వెంకటేశ్వరరావు, బసవయ్య పాల్గొన్నారు.



ఆశ్రమానికి బియ్యం అందజేస్తున్న సభ్యుడు కేసా సత్యం తదితరులు

రాములోరికి ఘనంగా తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక పరమానందం కలిగించింది. దర్బారు సేవలో హరిదాసులు ఆలపించిన కీర్తనలు ఆధ్యాత్మికతను నింపాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి కానుకలను సమర్పించారు. గురువారం పునర్వసును పురస్కరించుకుని ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం ఉంటుంది.

కాంతులీనేందుకు దీపాంతలు సిద్ధం




యంత్రంపై దీపాంతల తయారీలో నిమగ్నమైన మహిళ, ప్రమిదలను ఆరబెడుతున్న వృత్తిదారులు

మరో వారం రోజుల్లో వెలుగుల పండగ దీపావళి రానుంది. బాణసంచాతోపాటు దీపాలు వెలిగించడం సంప్రదాయం. ఇప్పటికే విపణిలో దీపావళి సందడి మొదలైంది. శాలివాహనులు దీపాంతల తయారీలో నిమగ్నమయ్యారు. ఇంటిల్లిపాది వీటిని తయారు చేసి ఆరబెట్టి కాల్చి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ కుమ్మరివాడలో 60కి పైగా కుటుంబాలు ఉన్నాయి. కొందరు చేతులతో, కొంతమంది యంత్రాలపై వీటిని మలుస్తున్నారు. దీపావళి దీపాంత (ప్రమిద)ల తయారీలో ఇలా నిమగ్నమైన చిత్రాలను 'ఈనాడు' కెమెరా బంధించింది.
- ఈనాడు, ఖమ్మం

ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: సరైన ఆధారాలు లేకుండా బీమా క్లెయిమ్‌ను తిరస్కరించటంపై ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. పూర్తి బీమా మొత్తాన్ని చెల్లించాలంటూ ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. భద్రాద్రి జిల్లా గుండాల మండలం శెట్టిపల్లికి చెందిన జనగాం అంకులు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన స్కీమ్, జీవన్ అభయలో చేరారు. ఇందులో చేరిన మూడేళ్లకు అంకులు మరణించడంతో నామినీగా ఉన్న అతడి కుమారుడు సాంబయ్య క్లెయిమ్ కోసం అభ్యర్థించారు. సరైన ఆధారాలు చూపకుండా క్లెయిమ్ నిరాకరించడంతో సాంబయ్య ఖమ్మం జిల్లా కమిషన్‌ను ఆశ్రయించారు. సానుకులంగా తీర్పు రావడంతో ప్రతివాద బీమా సంస్థ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ వేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం రాష్ట్ర వినియోగదారుల కమిషన్ జిల్లా కమిషన్ తీర్పును సమర్థిస్తూ అంకులు మరణానంతర ప్రయోజనాలు ఇవ్వాలని బీమా సంస్థను ఆదేశించింది.

సందర్శకుల సంఖ్య పెరిగేలా చర్యలు


ఈనాడు కథనానికి స్పందన

ఖమ్మం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరం వెలుగుమట్లలోని అటవీశాఖ అర్బన్ పార్కుకు సందర్శకుల సంఖ్య పెంచే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి బుధవారం పార్కును సందర్శించారు. 'నగర సిగలో అరణ్య హొయలు' శీర్షికతో ఈనెల 4న, 'పేరుకే ఉద్యానం.. ఆటపాటలకు ఆగమాగం' శీర్షికన ఈనెల 17న 'ఈనాడు' కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ వార్తలకు స్పందించిన కలెక్టర్ అర్బన్ పార్కులో కమాండర్ జీపులో సుమారు 4 కి.మీ. మేర ప్రయాణించారు. గోల్డెన్ ఓరియంటల్ టవర్ ఎక్కి పార్కు చుట్టుపక్క ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి రోజూ పార్కుకు ఎంత మంది సందర్శకులు వస్తున్నారు, ఎంత ఆదాయం సమకూరుతుంది, పార్క్ నిర్వహణకు అవుతున్న ఖర్చు తదితర వివరాలను జిల్లా అటవీశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పార్కులోని యోగా షెడ్డు, పిల్లల ఆటస్థలం, నక్షత్ర వనం, రాశీ వనం, ఓపెన్ జిమ్, ల్యాండ్ స్కేప్ గార్డెన్, బటర్ ఫ్లై గార్డెన్, సైక్లింగ్ షెడ్, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాచ్ టవర్‌లను సరిగా వినియోగిస్తూ సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పార్కులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆహ్లాదంగా గడిపేలా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. బస్‌స్టాండ్ నుంచి పార్కు వరకు మినీ బస్సు నడిపే ప్రతిపాదన పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం, ఈనాడు, ఖమ్మం



అధికారులకు సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

గుండెపోటుతో యువకుడి మృతి



సాయికిశోర్

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: జన్మదినం రోజే గుండెపోటుతో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నామవరం గ్రామానికి చెందిన శివాలయ అర్చకుడు శివరామమూర్తి రెండో కుమారుడు సాయికిశోర్(28) రాజాపురంలో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఇంట్లో ఉదయం తలస్నానం చేసేందుకు వెళ్లే క్రమంలో గుండెపోటు రావటంతో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఎన్.అప్పారావుకు 6 నెలల జైలుశిక్ష విధించారు. ఫిర్యాదుదారుకు రూ.8 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వి.మాధవి బుధవారం తీర్పు చెప్పారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు జె.సత్యనారాయణ తన న్యాయవాది ఆవుల రఘురామయ్య ద్వారా దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వెలువరించారు.

మిలీషియా సభ్యులు అరెస్టు



మిలీషియా సభ్యులు పొడియం కమ్లు, మడకం సోంబారు

దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం మండలం పెదబండిరేవు గ్రామంలో పట్టుబడిన ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ అశోక్ కథనం ప్రకారం... స్థానిక ఎస్సై వెంకటప్పయ్య తన సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవాన్లతో పెదబండిరేవు క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు తెల్లటి సంచులు తీసుకొని పెదబండిరేవు వైపు అనుమానాస్పదంగా వెళ్తున్నారు. వెంటనే వీరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంపూర్ గ్రామానికి చెందిన పొడియం కమ్లు అలియాస్ రాజ్‌కుమార్, మడకం సోంబారు అనే వీరు ఆర్పీసీలో మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వెల్లడైంది. గంగలూరు ఏరియా కమిటీ సెక్రటరీ మొడియం దినేష్ వద్ద సుమారు రూ.20 వేలు తీసుకొని పేలుడు పదార్థాలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుక్కునూరు గ్రామానికి వచ్చి మిరప తోటల్లో కూలీ పనులు చేస్తున్నారు. ఈనెల 22వ తేదీన కార్డెక్స్ వైర్లను తీసుకొని దినేష్‌కు ఇవ్వడానికి వీరిద్దరు కుక్కునూరు నుంచి బయలుదేరినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి సుమారు 50 మీటర్ల పొడవు కలిగిన కార్డెక్స్ వైరు రూ.11,500 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

జవాన్ సోదరుడిపై దాడి : దంతెవాడ జిల్లా హిరోలీ గ్రామానికి చెందిన దేవా దంతెవాడలో జవాన్‌గా పని చేస్తున్నాడు. ఇతను సెలవుపై ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేయడానికి వచ్చారు. మావోయిస్టులు ఇతని ఇంటికి వచ్చి దేవాను పిలవడంతో వెంటనే ఇతని సోదరుడు కుంజాం లక్ష్మణ్ బయటకు వచ్చాడు. అతన్ని దేవాగా భావించిన మావోయిస్టులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే జగదల్‌పూర్‌లోని డిమ్రాపాల్ మెడికల్ ఆసుపత్రికి తరలించారు.

ఆధార్ తరహాలో.. విద్యార్థులకు అపార్

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు ప్రవేశపెడుతోంది. విద్యార్థులకు ఓ ప్రత్యేక గుర్తింపు కార్డును తెచ్చేందుకు తాజాగా నిర్ణయించింది. అందరికీ ఆధార్ తరహాలో ఓ కార్డు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. దాని పేరే.. 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రీ).

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు విద్యాలయాల వారీగా వివరాలను వేర్వేరుగా నమోదు చేసే ప్రక్రియ ప్రస్తుతం అమలులో ఉంది. దీనికి బదులుగా 'వన్ నేషన్-వన్ స్టూడెంట్' లక్ష్యంతో అన్ని రకాల విద్యాసంస్థల్లోనూ కేజీ నుంచి పీజీ వరకు ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డును జారీ చేయడమే నూతన విధానం. 12 సంఖ్యలతో మంజూరు చేయనున్న 'అపార్' ఐడీలో విద్యార్థుల సమగ్ర వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాల నమోదుకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని 'యూ-డైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)'లో నమోదు చేశారు. ఒక్కో విద్యార్థికి ఒక 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్'(పెన్)ను కేటాయించారు. యూడైస్ ప్లస్ ఆధారంగా అపార్ కార్డులు అందించేలా డీఈవోల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.



పాఠశాలలు / విద్యార్థులు	
ఖమ్మం..	1,616 / 2,18,005
భద్రాద్రి..	1,665 / 1,69,742

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

వెంకటేశ్వరాచారి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం

'అపార్' కార్డు ప్రాముఖ్యతపై విద్యాలయాల్లో ఈ నెల 19న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో విశదపరిచాం. పాఠశాలల యాజమాన్యాలకు ముఖ్య సూచనలు తెలియజేశాం. ప్రతి విద్యార్థి సమగ్ర సమాచారం ఒక్క క్లిక్‌కు అందుబాటులో ఉంటుంది.

ప్రత్యేకత ఇదీ..

- ఈ కార్డులో భాగంగా విద్యార్థులు సాధించిన విజయాలు, మార్కుల వివరాలు, మెమోలు, ఉపకార వేతనాలు, నైపుణ్యాలను సంక్షిప్తంగా నమోదు చేస్తారు.
- ఇది ఒక విద్యార్థి జీవిత కాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. ఆధార్‌తో అనుసంధానిస్తారు.
- ఎప్పుడు అవసరమైనా విద్యార్థుల సమగ్ర వివరాల ఒకే గొడుగు కింద, అధీకృతంగా లభిస్తాయి. దీనివల్ల కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలో పదే పదే ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. కార్డ్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సరిపోతుంది.
- ప్రవేశ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలకు బదులు 12 అంకెల సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుంది.
- కాకపోతే కార్డు జారీ చేసే ముందు విద్యార్థుల తల్లిదండ్రుల సమ్మతిని తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ దీన్ని తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలి.

వద్దన్నా వినలేదు.. పట్టాలపై శవమయ్యాడు..

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ కరకవాగు సమీపంలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన షేక్ యాకూబ్ పాషా(31) రైల్వే ట్రాక్ వద్ద కూర్చుని సాయంత్రం 4.30 నుంచి మద్యం తాగాడు. ఆ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన స్థానికులు, రైల్వే ఉద్యోగులు.. 'కాసేపట్లో రైలు వస్తుందని, ఇక్కడ్నుంచి పక్కకు వెళ్లాలని' హెచ్చరించారు. రాత్రి 7 గంటల సమయంలో పాయింట్ మెన్ ట్రాక్‌ను గమనిస్తున్న సమయంలో పట్టాలపై యాకూబ్ పాషా మృతదేహం చెల్లాచెదురై కనిపించింది. స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆసుపత్రి శవాగారానికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావడం లేదని మృతుడి బంధువులు తెలిపారు. మృతుడి భార్య సన ఫిర్యాదుతో ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు మగ పిల్లలు.



షేక్ యాకూబ్ పాషా

1 నుంచి అమరవీరుల సంస్మరణ సభలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: భూమి, భుక్తి, విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ నవంబరు 1 నుంచి 9 వరకు గ్రామగ్రామాన సంస్మరణ సభలు నిర్వహించాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్డీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భూస్వాముల చెరలో చిక్కిన వేల ఎకరాలను పేదలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవోద్యమం సొంతం. ఆయా పోరాటాల్లో బత్తుల వెంకటేశ్వర్లు, చంద్ర పుల్లారెడ్డి, కాచనపల్లి అమరవీరులు ఎల్లన్న, సురేశన్న, బాటన్న, లింగన్న, మురళి, ముక్తార్ పాషా, బొర్ర వీరస్వామి, పగడాల వెంకన్న, తుడుం రామయ్య వంటి వారెందరో ప్రాణాలర్పించారు' అని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, నాయకులు గౌని నాగేశ్వరరావు, సారంగపాణి, శ్రీనివాసరావు, ఉపేందర్, మోకాళ్ల రమేశ్, మోతీలాల్, ఇర్ప రాజేశ్ పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్త పత్తి	6,000	7,100	6,800
పెసలు	6,050	7,000	6,800
మొక్కజొన్నలు	2,251	2,251	2,251
ఏసీ ఎండుమిరప	10,500	19,000	17,400
ఎండుమిరప	9,000	17,000	14,700
ఏసీతాలుమిరప	7,000	8,500	7,000

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

భద్రాచలం

•భద్రాచలం •పినపాక •అశ్వారావుపేట

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి ప్రియాంక, తన్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతులను మభ్యపెడుతున్న కాంగ్రెస్’

దమ్మపేట, న్యూస్‌టుడే: రూ.రెండు లక్షల రుణమాఫీ, రైతుభరోసా అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మభ్యపెడుతోందని సీపీఎం రైతు సంఘం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. మందలపల్లి పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇప్పటికీ రైతుభరోసా విధివిధానాలపై ముఖ్యమంత్రికే స్పష్టత కరవైందన్నారు.

సమస్య: అమెర్దాకాలనీలోని మూడో వీధిలో ఇళ్ల ముందు ఉన్న ఖాళీ స్థలాల్లో, సైడ్ కాల్వల వెంట పిచ్చిమొక్కలు పెరిగి పెద్దవి అయి రహదారిపైకి వ్యాపిస్తున్నాయి.
– భానుచందర్, అమెర్దాకాలనీ

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తాం. – అనూష, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అమెర్దా
– అశ్వాపురం, న్యూస్‌టుడే

పరుచుకున్న పచ్చదనం



మొండికుంట-సీతారాంపురం మధ్య 5 కి.మీటర్ల పొడవునా మణుగూరు ప్రధాన రహదారికి ఇరువైపులా తుమ్మల చెరువు ఆయకట్టు పరిధిలోని వరి పొలాలు కనుచూపు మేరలో భూమిపై పచ్చదనాన్ని పరిచినట్లు ఉన్నాయి. ఆ మార్గంలో రాకపోకలను కొనసాగించే ప్రయాణికులకు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. – మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే

దివి నుంచి భువికి మేఘమాలిక



ఇదీ దివి నుంచి భువికి దిగిన మేఘమాలిక.. అశ్వాపురం మండలం మొండికుంట వద్ద ఆకాశంలో ఈ సుందర దృశ్యం కనిపించింది. ఆకాశం నిండా నల్లని మేఘాలు కమ్ముకుని మొండికుంటలో భారీ వర్షం కురిసింది. దూరం నుంచి చూసిన వారికి దివిని భువిని కలుపుతూ మేఘాలు కిందకు దిగివచ్చాయా? అన్నట్లు కనిపించింది. పలువురు ప్రకృతి ప్రేమికులు ఈ సుందర దృశ్యాన్ని తమ చరవాణుల్లో బంధించారు. – అశ్వాపురం, న్యూస్‌టుడే

అమ్మ ఉయ్యాల.. అడవి జంపాల



అడవిలో కొన్ని ఉత్పత్తులను సేకరించేందుకు ఆ తల్లి తన బిడ్డతోపాటు ఉయ్యాలను తీసుకొని వెళ్లింది. ఒక చెట్టుకు ఉయ్యాలను కట్టి అందులో బిడ్డను నిద్రపుచ్చి ఉత్పత్తులను సేకరించింది. ఆ సమయంలో బిడ్డను అడవి ఒడిలో దాచుకుంది. బిడ్డను అడవికి అప్పగించి ఆ తల్లి ధైర్యంగా వెళ్లింది. మణుగూరు అడవిలోని బుడగల గ్రామంలో కన్పించిన ఈ దృశ్యాన్ని ‘న్యూస్‌టుడే’ క్లిక్‌మన్పించింది. – మణుగూరు, న్యూస్‌టుడే

పంచాయతీల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం టేకులచెరువు, నకిరిపేట, లక్ష్మీపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, బాదం రమేష్ రెడ్డి, భజన సతీశ్‌కుమార్, ఇంగువ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: ఎమ్మెల్యే


నూతన శౌచాలయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకులం ఆవరణలో ఐటీసీ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో నిర్మించిన శౌచాలయాలను ఎమ్మెల్యే వెంకట్రావు, ఐటీడీఏ పీఓ రాహుల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడితేనే చదువుల్లో రాణించవచ్చన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు వినియోగించుకొని చదువుల్లో చక్కని ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు పాఠశాల/కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఐటీసీ పరిశ్రమ యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్, జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) పి.శ్యామ్ కిరణ్, మేనేజర్ చెంగల్‌రావు, గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్సీఓ నాగార్జునరావు, ఐటీసీ గుత్తేదారు పాకాల దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్‌లు పద్మావతి, దేవదాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు వితరణ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ములసిమడుగు గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా బుధవారం నిత్యావసర సరకులు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మానవతా దృక్పథంతో స్పందించి వితరణ చేశారు. నాయకులు వెంకటరెడ్డి, తెల్లం నరేష్, ఖాదర్ బాబు, రాజేశ్వరి పాల్గొన్నారు.

ముసురుకున్న సమస్యలు.. రోగులకు అవస్థలు

బూర్గంపాడు, న్యూస్‌టుడే


బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రి

బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రి పర్యవేక్షణను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి వైద్య విధాన పరిషత్‌కు మార్చిన ఉన్నతాధికారులు ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. 30 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో నిత్యం 150 నుంచి 200 వరకు ఓపీ ఉంటోంది. ఇన్‌పేషెంట్లు కూడా అధికంగానే ఉంటున్నారు. ఇక్కడ 12 మంది వైద్యుల అవసరం ఉండగా ప్రస్తుతం నలుగురే విధుల్లో ఉన్నారు. 30 పడకలకు అవసరమైన భవనాలు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే బెడ్లు ఏర్పాటు చేశారు. ఆపరేషన్ థియేటర్‌కు అనువైన స్థలం లేదు. వానాకాలం తరుణంలో ఆసుపత్రికి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఈ ఆసుపత్రికి స్థానికులతోపాటు ఏపీ నుంచి సైతం రోగులు వస్తూ ఉంటారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనంలోనే ఈ ఆసుపత్రి కొనసాగుతోంది. చాలా వరకు ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. మార్చురీ గది సైతం పాడవడంతో శవపరీక్షలకు ఇబ్బందిగా మారింది. ఆసుపత్రి ప్రహరీతోపాటు నూతన భవనాల నిర్మాణాలకు గతేడాది సెప్టెంబరులోనే శంకుస్థాపన చేసినా పనులు పట్టాలెక్కలేదు. దీంతో వైద్యులతోపాటు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటిండెంట్ డా.ముక్కంటేశ్వరరావును ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా నూతన భవనాల నిర్మాణాలకు పాలనపరమైన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశం ఉందని వివరించారు.

అండర్-14 జాతీయ క్రికెట్ జట్టుకు రిత్విక్ ఎంపిక



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అండర్-14 జాతీయ క్రికెట్ జట్టుకు భద్రాచలానికి చెందిన రిత్విక్ ఎంపికైనట్లు స్థానిక బెస్ట్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు వెల్లడించారు. గద్వాల్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఈ పోటీల ఎంపికల్లో రిత్విక్ బ్యాటింగ్‌లో ఉత్తమ కనబరచడంతో వారు ఎంపిక చేసినట్లు తెలిపారు. స్థానికంగా ఎనిమిదో తరగతి చదువుతున్న రిత్విక్‌కు ఈ సందర్భంగా పట్టణంలో పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద మరింత పోలీసు నిఘా ఏర్పాటుకు కార్యాచరణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో బ్రిడ్జి పాయింట్ చెక్‌పోస్టు వద్ద మరింత పటిష్ఠ పోలీసు నిఘా పెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు బుధవారం నుంచి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇక్కడ తనిఖీలు నిర్వహించేందుకు ఇద్దరు చొప్పున సిబ్బందిని ఏర్పాటు చేశారు. గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక తదితరం నిఘా కళ్లు కప్పి సరిహద్దులు దాటుతుండటంతో ఈ కార్యాచరణ రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల కోసం వాక్ ఇన్ అడ్మిషన్లు చేపడుతున్నామని కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ధర్మాచారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పినపాక, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్‌తోపాటు మరో 8 మందితో నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజు హాజరయ్యారు. రామాచారి, రామారావు, అన్నపూర్ణ, మేగ్యా, శ్రీనివాస్, ప్రమీల పాల్గొన్నారు.

‘క్యాంటీన్ ఏర్పాటులో సంఘాలు విఫలం’

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కష్టపడి పని చేస్తున్న కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేయడంలో కార్మిక సంఘాలు విఫలమయ్యాయని తెబొగకాసం బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పశువైద్యాధికారిగా షేక్ రుబీనా ఫర్వీన్

అశ్వాపురం, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండల నూతన పశువైద్యాధికారిగా డాక్టర్ షేక్ రుబీనా ఫర్వీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పశు వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ సరస్వతి మణుగూరుకు బదిలీ అయ్యారు. ★ దుమ్ముగూడెం పశువైద్యాధికారిగా లిఖిత బుధవారం విధుల్లో చేరారు.

సతీష్‌పై చర్యలు తీసుకోవాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదివాసీ అడవి బిడ్డలమైన తమను మోసం చేసిన అటవీ హక్కుల ఛైర్మన్ సతీష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని పెద్దిపల్లి రైతులు పేర్కొన్నారు. మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రామానుజవరం పంచాయతీలోని పెద్దిపల్లి గ్రామంలో గత 30 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమను సతీష్ అనే వ్యక్తి పట్టాలిప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. నేటి వరకు పట్టాలిప్పించలేదని విమర్శించారు. రైతులు జోగయ్య, పెద్దసోమయ్య, భీమయ్య, బాబురావు, దేవయ్య, భద్రయ్య, ఉంగయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లను తొలగించేందుకు సర్వే చేపట్టారని, ఇందులో ఇళ్లు కోల్పోయే నిర్వాసితులకు న్యాయం చేయాలని న్యాయవాది పిట్టా శ్రీనివాసరెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ కమిషనర్‌లకు తపాలా శాఖ ద్వారా వినతిపత్రాలు పంపించినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇళ్లు కోల్పోయే బాధితులకు నాలుగురెట్ల నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

ఐదు పంచాయతీలు కలపాలి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీలో విలీనమైన, భద్రాచలానికి ఆనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు తెలంగాణంలో కలిపాలని తెజస ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి గోపగాని శంకర్‌రావు అన్నారు. బుధవారం భద్రాచలం వచ్చిన ఆయన మాట్లాడారు. రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి అమ్రీన్‌కు పాకాల ఆర్థికసాయం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణానికి చెందిన జావెలిన్ త్రో క్రీడాకారిణి అమ్రీన్‌కు ఐటీసీ గుత్తేదారు పాకాల దుర్గాప్రసాద్, లక్ష్మి దంపతులు రూ.5 వేల విరాళం బుధవారం అందజేశారు. తెదేపా నాయకులు ఎస్కే అజీమ్ పాల్గొన్నారు.

రక్షణ కంచె తొలగింపుపై కేసు నమోదు

దమ్మపేట: చిన్నగొల్లగూడేనికి చెందిన సాయిబాబు భూమికి వేసిన ఫెన్సింగ్ స్తంభాలను అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విరగొట్టారు. ఈవిషయంపై దమ్మపేట ఠాణాలో సాయిబాబు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

బాణసంచా పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని అశోక్‌కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. సుమారు రూ.5 లక్షల విలువైన సరకు అక్రమంగా నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: జారె


దామరచర్లలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

చండ్రుగొండ, న్యూస్‌టుడే: అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నానని, అందుకే ‘మీ ఎమ్మెల్యే.. మీ ఇంటికి’ అనే కార్యక్రమం రూపొందించామని శాసనసభ్యుడు జారె ఆదినారాయణ అన్నారు. చండ్రుగొండ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పర్యటించారు. పలువురికి కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. దామరచర్ల నుంచి సీతాయిగూడెం వెళ్లే రహదారి మార్గంలో వంతెన నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎంపీడీఓ బి.అశోక్, కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, గోవిందరెడ్డి, బొర్రా సురేష్, బడుగు కృష్ణవేణి, రుక్మిణి పాల్గొన్నారు. దిశ కమిటీ సభ్యుడిగా ఎంపికైన బెండాలపాడు వాసి బొర్రా సురేష్‌ను దామరచర్లలో ఎమ్మెల్యే సన్మానించారు.

భద్రాచలం ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతుల ప్రతినిధులు

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన సీతమ్మసాగర్ భూనిర్వాసిత రైతుల ప్రతినిధులు భద్రాచలం ఆర్డీఓ దామోదరరావును కలిసి వారి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సీతమ్మ సాగర్ నిర్మాణం వల్ల పైపులు, మోటార్లు ధ్వంసం కావడంతో మిగిలిన అరకొర భూములకు కూడా సాగునీటి సౌకర్యం కరవైందని, వెంటనే తమ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. భూ నిర్వాసిత రైతుల ప్రతినిధులు కొమరం దామోదరరావు, సాగి రామచంద్రరాజు, తెల్లం లక్ష్మీనారాయణ, కారం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తో భారాస నాయకుల సమాలోచనలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు సమాలోచనలు చేశారు. బుధవారం హైదరాబాద్ వెళ్లి కలిసిన వారు భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏజెన్సీలో పార్టీ పరిస్థితులను కేటీఆర్‌కు వివరించినట్లు వారు వెల్లడించారు.


కేటీఆర్‌తో రేగా, రావులపల్లి, మానే

అంకితభావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలకు


గోపాలకృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఏడీ, ఆచార్యులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: చేసే పనిలో నిబద్ధతత ఉంటే అదే మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తోందని వ్యవసాయ కళాశాల ఏడీ జె హేమంత్‌కుమార్ అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఆచార్యుడిగా పనిచేసి విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయానికి సాంకేతిక ఆచార్యులుగా బదిలీపై వెళ్తున్న కె.గోపాలకృష్ణమూర్తిని బుధవారం బోధన, బోధనేతర సిబ్బంది సన్మానించారు. ఆచార్యులు డా.ఐవీఎస్ రెడ్డి, నాగాంజలి, కోటేశ్వర్, శ్రావణ్‌కుమార్, మధుసూదనరెడ్డి, శిరీష ఉన్నారు.

‘ప్రత్యామ్నాయం భాజపానే’


చింతకుంటలో సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న వెంకట్, క్రాంతికుమార్

చర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాజపానే ప్రత్యామ్నాయంగా భావించి ప్రజలు పెద్దఎత్తున తమ పార్టీలో చేరుతున్నారని భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌ఛార్జి జన్ను వెంకట్, జిల్లా అధ్యక్షుడు బిట్రగుంట క్రాంతికుమార్ అన్నారు. చర్ల మండలం చింతకుంట, మొగళ్లపల్లి, గొంపల్లిలో భాజపా ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కొండేచి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన అతిపెద్ద పార్టీ భాజపానేన్నారు. బూత్‌స్థాయిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి మరోసారి రికార్డు అధిగమిస్తామన్నారు. సాధం లోకనాధం, ముత్యాల తాతాజీ, ఆలెం సమ్మయ్య, యడవల్లి శేషగిరి, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి, న్యూస్‌టుడే: భాజపాను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు రాజేశ్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వ సభ్యత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలాధ్యక్షుడు శంకర్, నవీన్, ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

అబ్కారీ అధికారిపై ఫిర్యాదు..!

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ‘గొలుసు కట్టు దుకాణం నడుస్తుంది.. మీకు చేతనైతే ఏమైనా చేసుకోండి’ అని ఓ అబ్కారీ అధికారి అన్నట్లుగా ఆడియో రికార్డు సామాజిక మాధ్యమాల్లో బుధవారం చక్కర్లు కొట్టింది. బూర్గంపాడు మండలం మణుగూరు క్రాస్‌రోడ్డు వద్ద గొలుసుకట్టు దుకాణానికి సంబంధించిన ఫిర్యాదు ఇవ్వటానికి న్యాయవాది కర్ణే రవి భద్రాచలం అబ్కారీ శాఖ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో అధికారి లేకపోవటంతో ఫోన్‌లో మాట్లాడారు. ఈక్రమంలో సదరు అధికారి పైవిధంగా మాట్లాడినట్లు సమాచారం. అధికారి వ్యాఖ్యలపై అదే అబ్కారీశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని రవి తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి: డీఎస్పీ


కరకగూడెం: సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న డీఎస్పీ

కరకగూడెం, న్యూస్‌టుడే: అంకితభావంతో విధులను నిర్వర్తించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కరకగూడెం పోలీస్ ఠాణాలో తనిఖీలు నిర్వహించారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని, మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను కరకగూడెం ఎస్సై రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఠాణాలోని పలు రికార్డులను పరిశీలించారు. ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. షీటీం నిర్వహించిన జూంమీటింగ్‌కు చండ్రుగొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఎస్ఐ గంజి స్వప్న, విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ లత, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

6 వరకు ఓటు నమోదుకు అవకాశం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ సూచించారు. ప్రధానోపాధ్యాయులతో అశ్వారావుపేటలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబరు 6 వరకు ఓటు నమోదుకు అవకాశముందని తెలిపారు.

కుమురంభీం పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: అడవి బిడ్డల హక్కుల కోసం అలుపెరగని ఉద్యమం చేపట్టిన నాయకుడు కుమురంభీం అని ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అన్నారు. ఆళ్లపల్లి జడ్పీ పాఠశాలలో బుధవారం కుమురంభీం వర్ధంతి నిర్వహించారు. నాయకులు పాయం రమేష్, ఏటీఏ రాష్ట్ర నాయకులు ముడిగ సమ్మయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ రామయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు హన్మంతరావు, ఏఈడబ్ల్యూసీఏ జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కుమురంభీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

రహదారి విస్త‘రణం’..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: మితిమీరిన రాజకీయ జోక్యంతో రహదారి విస్తరణకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. అశ్వారావుపేట పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖమ్మం మార్గం వైపు ఆక్రమించుకొని నిర్మించిన షెడ్లను తొలగించేది లేదని కొంత మంది భీష్మించుకు కూర్చున్నారు. ఓ పార్టీ నాయకులు వారికి కొమ్ముకాస్తుండటంతో రహదారి విస్తరణ పనులకు ఆటంకం కలుగుతోంది. 40 మీటర్ల పొడవు పనికి 15 రోజులుగా ఆర్‌అండ్‌బీ అధికారులు అవస్థలు పడుతున్నారు. ఈవిషయంపై ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ కొద్దిరోజుల్లో సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రహదారి విస్తరణ, మురుగు కాల్వల నిర్మాణ పనులను త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు.

రైతు ఖాతాల్లో నగదు జమ..


బూర్గంపాడు, న్యూస్‌టుడే


ముంపునకు గురైన వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (పాతచిత్రం)

భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఊరట లభించింది. అధిక వర్షాల ధాటికి పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేసింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. పినపాక నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 1,580 మంది రైతులకు చెందిన 2,210.27 ఎకరాలకు పరిహారం అందింది. మొత్తం రూ.2.21 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబరు ప్రారంభం వరకు విడవకుండా కురిసిన భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. వాగులు, చెరువుల పరివాహకంలో పంటలు కొట్టుకుపోయాయి. వరి, పత్తి, మిరప పంటలు అధికంగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల ఇసుక, రాళ్లు మేటలు వేశాయి. బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో నష్టం అధికంగా ఉంది. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం వాటిల్లింది. వర్షాలు తగ్గిన అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనాలను నమోదు చేసి నివేదికలు ప్రభుత్వానికి అందించారు. ప్రభుత్వం దసరా నుంచి నగదు జమ ప్రారంభించింది. పంటలతోపాటు పశువులు, జీవాలకు సైతం పరిహారం అందించారు. ఈ విషయమై ఏడీఏ తాతారావును ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా.. త్వరితగతిన నష్టం అంచనాలు నమోదు చేశామని వివరించారు.

భవనం శిథిలం.. సమస్యలు అధికం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే


శిథిలావస్థకు చేరుకున్న విశ్రాంత ఉద్యోగుల భవనం

మణుగూరులోని విశ్రాంత ఉద్యోగులకు గత కొన్నేళ్లుగా మనశ్శాంతి లేకుండాపోయింది. వారు కార్యకలాపాలు నిర్వహించుకునే విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మొత్తం 200 మంది విశ్రాంత ఉద్యోగులు ఉండగా, ప్రతిరోజు సుమారు 30 మంది వరకు వివిధ పనుల నిమిత్తం ఇతర మండలాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. కానీ భవనం మాత్రం పెచ్చులు ఊడిపోయి, వర్షం వచ్చినప్పుడు పైకప్పు నుంచి కురుస్తూ అడుగు వేసేందుకు కూడా వీలు లేకుండా మారింది. గతంలో రూ.లక్ష కేటాయించి భవనానికి కేవలం తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేయడంతో ప్రస్తుతం ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకరస్థితికి చేరుకుంది. ఈ విషయమై ఎమ్మెల్యే పాయంను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా... విశ్రాంత ఉద్యోగుల సమస్య తన దృష్టిలో ఉందని, వీలైనంత త్వరలో వారికి నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

కొత్తగూడెం
•కొత్తగూడెం • ఇల్లెందు

పార్కింగ్ స్థలాల ఆక్రమణపై నోటీసులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: బోడు రోడ్డు కూడలిలో పార్కింగ్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రవీందర్‌రావు హెచ్చరించారు. డ్రైనేజీ దాటి వచ్చి పార్కింగ్ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న పలు దుకాణాల నిర్వాహకులతో బుధవారం ఆయన మాట్లాడారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేశారు. ఎంపీఓ గణేశ్‌గాంధీ, కార్యదర్శి దీప్తి, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రహదారులను పూర్తిచేయండి'

లక్ష్మీదేవిపల్లి: అసంపూర్తిగా నిలిచిన పలు రహదారుల పనులను సత్వరం పూర్తిచేసి ప్రజా ఇబ్బందులను తొలగించాలని భాజపా మండలాధ్యక్షుడు గాంధీ అన్నారు. బుధవారం మండలంలోని రేగళ్ల, లక్ష్మీపురం, అర్లగండి, లోతువాగు గ్రామాల్లో పర్యటించి అక్కడి రహదారుల సమస్యలను తెలుసుకొన్నారు. కార్యక్రమంలో రమేశ్, నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

టేకులపల్లి, న్యూస్‌టుడే: బొమ్మనపల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి పెగళ్లపాడు, తడికలపూడి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పిండిపోలు బుజ్జికన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

సమస్య: జూలూరుపాడు-వెంగన్నపాలెం పొలిమేర రహదారికి ఇరువైపులా అపరిశుభ్రత నెలకొంది. రెండు గ్రామ పంచాయతీల పరిధిలో ఈ రహదారి ఉన్నందున సమస్యపై దృష్టిపెట్టడం లేదు. బ్లీచింగ్ చేయడం లేదు. **- స్థానికుడు, వెంగన్నపాలెం**

సమాధానం: పొలిమేర రహదారికి ఇరువైపులా పారిశుద్ధ్య పనులు చేపడతాం. బ్లీచింగ్ పొడి చల్లాలని ఇరు పంచాయతీల కార్యదర్శులకు సూచిస్తాం. **- తులసీరాం, మండల పంచాయతీ అధికారి**

జూలూరుపాడు, న్యూస్‌టుడే



పాల్వంచ సబ్‌స్టేషన్ ఏరియాలో వీధి దీపాలు కొద్ది నెలలుగా వెలగడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. **- రహీం, స్థానికుడు**

✔ ఏరియా సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **- రాము, ఏఈ, పురపాలకం**

పాల్వంచ, న్యూస్‌టుడే

విద్యార్థులకు 'ఓపెన్ హౌస్' ప్రదర్శన



పోలీసు జాగిలాలు నిందితుల వాసనను ఎలా పసిగడతాయో విద్యార్థులకు వివరిస్తున్న డాగ్‌స్క్వాడ్ బృందం నిపుణుడు..

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 'ఓపెన్ హౌస్'ను బుధవారం నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాటి ప్రాధాన్యం, పనితీరు గురించి కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు వివరించారు. నిందితులతో పాటు మత్తు పదార్థాలను గుర్తించే నైపుణ్యం పోలీసు జాగిలాలకు? వాటికిచ్చే శిక్షణ గురించి ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులు కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించారు. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. అమరవీరుల స్మరణలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందన్నారు. పోలీసు విధులు, బాధ్యతలు, ప్రాణత్యాగాల విలువలను నేటి తరానికి తెలియచేయడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్యోద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, అడ్మిన్ ఆర్.ఐ. లాల్‌బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దలకు ఆరోగ్య బాట.. పిల్లలకు ఆటవిడుపు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

పర్యాటకులు, నడక సాధకులను ఆకర్షించేలా అటవీ శాఖ అర్బన్ పార్కు(నందనవనం)ను తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. లక్షకు పైగా జనాభా దాటిన పాల్వంచ పుర వాసులకు కొత్తగా మరో వ్యాయామశాల (ఓపెన్ జిమ్), పిల్లలకు పార్కు అందుబాటులో రానుండటం విశేషం.

2022లో 'కాంపా' (కాంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ ప్లానింగ్ అథారిటీ) పథకం కింద రూ. కోటి నిధులు అటవీ శాఖకు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాల్వంచ మండలం బసవతారక కాలనీలో 108 ఎకరాల్లో అర్బన్ పార్కును నిర్మించారు. 6 కిలో మీటర్ల మేర రక్షణ కంచె నిర్మించారు. నడక సాధకులకు ట్రాక్ (వాకర్స్ పాత్), వాచ్ టవర్, రాక్‌ఫిల్ డ్యాంలు, కుంటలు సైతం నిర్మించారు. ఇక్కడి అవసరాలకు విద్యుత్తుతో నిమిత్తం లేకుండా సోలార్ మోటార్లు కూడా అమర్చారు. ఖాళీ ప్రదేశాల్లో ఉపాధి హామీ పథకం కింద 50 వేల మొక్కలు నాటించారు. సందర్శకులతో పాటు ఆరోగ్య సంరక్షణకు వచ్చేవారికి, పిల్లలకు ఆహ్లాదాన్నిచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు అటవీ శాఖ తాజాగా నిర్ణయించింది.

రూ.20 లక్షలు కేటాయింపు

నందనవనంలో అదనంగా పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ నిర్మాణానికి 'హరిత నిధి' నుంచి ఇటీవల రూ.20 లక్షలు మంజూరయ్యాయి. చిన్నారుల కోసం జారుడు బల్ల, రంగులరాట్నం, ఆకట్టుకునే బొమ్మలతో ఉద్యానాన్ని నిర్మించనున్నారు. యువత కోసం ఏర్పాటయ్యే ఓపెన్ జిమ్‌లో పలు రకాల వ్యాయామ పరికరాలను అమర్చనున్నారు.



ఆరోగ్య సంరక్షణకు..

కొత్త వసతుల కల్పనలో భాగంగా అటవీ శాఖ అధికారులు 'ఆక్యుప్రెజర్ ట్రాక్' నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. దీనిపై చెప్పులు, బూట్లు వంటివి లేకుండా నడిస్తే.. అరికాళ్లలో ఉన్న నరాలు ఉత్తేజమై శరీరంలో ఆరోగ్యకరమైన మార్పులు జరుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు సైతం అదుపులో ఉంటాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పట్టణ జీవన శైలిలో నేడు ఎంతోమంది అసాంక్రమిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో అధికారుల ట్రాక్ నిర్మాణాన్ని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

నెలరోజుల్లో అందుబాటులోకి..

ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. నందనవనంలో చేపట్టిన పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ పనులను వచ్చే నెలరోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు. పురవాసులు, గ్రామాల ప్రజలు సందర్శించి ఆహ్లాదాన్ని పొందాలని కోరారు.



గోడపత్రాలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డా.ఎల్.భాస్కర్‌నాయక్


అయోడిన్ ఉప్పుతో రుగ్మతల నివారణ

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.ఎల్.భాస్కర్ నాయక్ ప్రజలకు సూచించారు. 'ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ' వారోత్సవాల సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గోడపత్రాలు, కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఐదు గ్రాముల అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలన్నారు. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం, వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు సమతుల్యతతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాంల అధికారులు డా.మధువరన్, డా.బాలాజీ, డెమో ఫయాజ్‌మొహియుద్దీన్, సూపరింటెండెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

మంచు చేసిన మాయ..!



మంచు తెరలు చేసిన మాయ ఇది. పాల్వంచ సమీపంలోని ఇందిరాకాలనీ, శ్రీనివాసకాలనీని ఉదయం 9 గంటల వరకు మంచు కప్పేసింది. ఆ సమయంలో పొగ మంచు మాటున మాయమైన గుట్ట.. ఆ తర్వాత భానుడి దర్శనంతో ఇలా ప్రత్యక్షమైంది. - పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



మంచు వీడాక..

ఏ ప్రమాదాలకీ ప్రవాహం?

పాల్వంచ నుంచి కొత్తగూడెం వచ్చే మార్గంలో ఇల్లెందు క్రాస్‌రోడ్డు సమీపంలో 30వ నంబరు జాతీయ రహదారి మీదుగా కిన్నెరసాని తాగునీటి పథకానికి చెందిన నీరు నిరంతరం ప్రవహిస్తోంది. పైపులైన్ లీకేజీతో పాటు అక్కడే ఉన్న ఫిల్టర్‌బెడ్ నుంచి నీళ్లు వచ్చి చేరుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రవాహం కారణంగా మార్జిన్‌తో పాటు రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. పురపాలకం, జాతీయ రహదారి అధికారులు స్పందించి 'కిన్నెరసాని' నీటి ప్రవాహానికి అడ్డు కట్టవేయాలని జంట పట్టణాల ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే



బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలు పాటించాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను సూచించారు. ఇల్లెందు, టేకులపల్లి ప్రాంతాల్లోని వ్యాపారులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అగ్నిమాపక నివారణకు నిబంధనలు పాటించాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, టేకులపల్లి సీఐలు బి.సత్యనారాయణ, టి.సురేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని డిమాండ్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పది నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి, కందగట్ల సురేందర్ అన్నారు. రుణమాఫీ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా, వాణిజ్య పంటలకు మద్దతు ధర, పోడు పట్టాలు, నివాస స్థలాలు, ఇళ్ల మంజూరు తదితర సమస్యలపై ఏఐకేఎంఎస్, ఎన్డీ చంద్రన్న వర్గం సభ్యులు డీటీకి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సుగుణ, ఉమా, కిషన్, రాజేశ్, కిషన్, మల్లన్న పాల్గొన్నారు.

సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు

కొత్తగూడెం కలెక్టరేట్: స్థానిక మహేశ్వరి థియేటర్‌లో సినీ హీరో ప్రభాస్ పుట్టిన వేడుకలను ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఈశ్వర్' సినిమాను ప్రదర్శించారు. జడ్పీ మాజీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, అభిమానులు ఎల్.సంతోశ్, ఎం.మెహబూబ్, బి.రాజేశ్, ఎస్కే జానీ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఏలూరి



టేకులపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.అన్వేశ్‌రెడ్డిని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు గాంధీభవన్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రైతుల సమస్యలు, రుణమాఫీ తదితర అంశాలను వారికి వివరించినట్లు ఏలూరి తెలిపారు.

విద్యార్థులపై ఫీ'జులుం' ఆగేదెన్నడు?: బీఎస్పీ

కొత్తగూడెం పట్టణం: అధిక ఫీజుల వసూళ్లతో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కామేశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజులుంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు ఎదురవుతున్న అవమానాలపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుమిత్రాదేవికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గంధం మల్లికార్జునరావు, మాలోతు వీరునాయక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు వినతి

కొత్తగూడెం సింగరేణి జూనియర్ కళాశాలలో చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్‌కు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యార్థి, యువజన సంఘం అధ్యక్షుడు కోట శివశంకర్ విన్నవించారు. బుధవారం కార్యదర్శిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

'ఐఎన్‌టీయూసీ పోరాటంతో సమస్యలు పరిష్కారం'

టేకులపల్లి: కేటీసీ ఎల్ఎస్ఎన్ ఓబీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలకు ఐఎన్‌టీయూసీ పోరాటాలతో పరిష్కారం లభించిందని ఓబీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముచ్చా సుధాకర్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎల్ఎస్ఎన్ యాజమాన్యంతో గౌరవాధ్యక్షుడు కోరం సురేందర్ ఆధ్వర్యంలో చర్చించినట్లు గుర్తుచేశారు.

వేతనాలను పెంచాలని ఆందోళన

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు, ధాన్యం, మొక్కజొన్నలు, ఇతర సరకులు రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు వేతనాలను పెంచాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డి.మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఇల్లెందులో సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసయ్య, సమ్మయ్య, కృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లల పంపిణీ



లక్ష్మీదేవిపల్లి: సంఘాల సభ్యులకు చేపపిల్లలను అందజేస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని 11 చెరువులకు 83,260 ఉచిత చేప పిల్లలను జిల్లా మత్స్యశాఖ జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చలపతిరావులు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో ఇంతియాజ్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం 50 శాతం చేప పిల్లలను పూర్తి ఉచితంగా అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బుచ్చయ్య, క్షేత్రాధికారి కోటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నూరుద్దీన్, ఎంపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత చేపపిల్లలను మత్స్య సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీందర్‌రావులు సూచించారు. మండలంలోని మత్స్య సొసైటీలకు మొత్తం 31 చెరువులకుగాను 2.43 లక్షల చేప పిల్లలను తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం పంపిణీ చేశారు. నాణ్యతలేని చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారంటూ కొందరు సొసైటీల సభ్యులు అధికారుల ఎదుటే అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కార్యక్రమాన్ని వెంటనే ముగించారు. మత్స్యశాఖ జిల్లా క్షేత్ర అధికారి కోటేశ్వరరావు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు జోగ బుచ్చయ్య, పలు సొసైటీల అధ్యక్షులు రామయ్య, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలకు తరలిరండి..

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం జరిగే పీడీఎస్‌యూ యాభై వసంతాల స్వర్ణోత్సవ సభకు పూర్వ నాయకులు, విద్యార్థులు తరలిరావాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ప రాజేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వర్ణోత్సవ గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు. శాస్త్రీయ విద్య, సమ సమాజం ఆవిష్కరణకు జరిగిన పోరాటంలో ఎంతోమంది విద్యార్థి నాయకులు అసువులుబాశారని అన్నారు.

టేకులపల్లి: వరంగల్‌లో ఈ నెల 25న జరిగే పీడీఎస్‌యూ యాభై వసంతాల పోరాట స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ పిలుపునిచ్చారు. సభ విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భరత్, అరుణ్, మౌనిక, సంధ్య, కావేరి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



తాటి బొజ్జి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: రామచంద్రాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు తాటిబొజ్జి(104) బుధవారం మృతి చెందారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమించి కన్నుమూశారు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, అయిదుగురు కుమారులు ఉన్నారు. బొజ్జి రజాకార్లకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటాల్లో సైతం పాల్గొన్నారని గ్రామస్థులు తెలిపారు.

జ్వరంతో విద్యార్థిని..

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చింతవర్రె గ్రామానికి చెందిన విద్యార్థిని (14) జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. దసరా సెలవులకు ఇల్లెందులోని వసతి గృహం నుంచి వచ్చిన ఆమె జ్వరం బారిన పడటంతో తల్లిదండ్రులు చికిత్సచేయిస్తున్నారు. బాలిక మృతి గురించి తెలుసుకున్న లక్ష్మీదేవిపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మేరెడ్డి వసంత, జనార్దన్‌రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గవర్నర్ పర్యటన నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు



ప్రధాన రహదారి పక్కన చెత్తను తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

జూలూరుపాడు, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం సాయంత్రానికి ఆయన సారపాక(భద్రాచలం) చేరుకోనుండగా, తిరుగు ప్రయాణంలో శుక్రవారం రోడ్డు మార్గంలో వెళ్తున్నందున ప్రధాన రహదారిలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్, రెవెన్యూ, పోలీసు అధికారులు పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించారు. జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్ నుంచి జూలూరుపాడు, సాయిరాం తండా, పడమటినర్సాపురం, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం వరకు తల్లాడ- కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఉన్న పంచాయతీల పరిధిలో ఇరువైపులా ఉన్న చెత్తకుప్పలు, పెంటకుప్పలు తొలగింపు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. పనులు పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో తాళ్లూరి రవి సూచించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



టేకులపల్లి: గోల్యాతండాలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు మండలంలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంకుస్థాపనలు చేశారు. మామిడిగుండాల పంచాయతీ వెంకటాపురం గ్రామానికి రూ.30 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో బీటీ రహదారి, రేపల్లెవాడ-కట్టుగూడెం మార్గంలో రూ.40 లక్షలు, చల్లసముద్రం పంచాయతీలో రూ.50 లక్షలతో చేపట్టనున్న కల్వర్టుల పనులను ప్రారంభించారు.

★ ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో మండల స్థాయి పార్టీ సమావేశం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అన్ని స్థాయిల్లోని శ్రేణులు సమష్టిగా పనిచేయాలన్నారు. పులి సైదులు, మండల రాము, కిరణ్, హరికృష్ణ, వెంకటమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం.. టేకులపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. మండలంలోని గోల్యాతండా పంచాయతీలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రావు, ఎంపీఓ గణేశ్‌గాంధీ, సీఐ తాటిపాముల సురేశ్, బోడు ఎస్సై శ్రీకాంత్, ఏఈ నవీన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవానాయక్, జిల్లా నాయకులు కోరం సురేందర్, నాయకులు మంగీలాల్‌నాయక్, గణేశ్, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలలు.. గుట్టు తేల్చేందుకేనా?

మెప్మా'లో రికవరీ చేయాల్సిన మొత్తం.. రూ.40 లక్షలు?

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పురపాలక సంఘంలో 'పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)'కు చెందిన ఇద్దరు ఉద్యోగులను పరిపాలనాపరమైన కారణాలతో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన తాజాగా బదిలీ చేశారు. ఈ ఘటన ఆ విభాగంలో చర్చనీయాంశమైంది. సదరు సిబ్బందిపై గతంలో వచ్చిన ఆరోపణలే స్థానచలనానికి కారణమని, అధికారులు విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వడంతో ఈ నిర్ణయం జరిగిందనే వాదన వినిపిస్తోంది. ఇదే క్రమంలో మెప్మాలో ఏం జరుగుతోందో వాస్తవాలను ఉన్నతాధికారులు నిగ్గుతేల్చనున్నారనే సంకేతాలు ఆయా వర్గాల్లో ఉత్కంఠను రేపాయి.



అసలు ఏం జరిగింది?

ఇల్లెందు మెప్మా పరిధిలో 675 పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 6,750 మంది సభ్యులున్నారు. సంఘం సభ్యులు నెలనెలా చెల్లించే రుణ వాయిదాలను కొంత మంది మెప్మా సిబ్బంది, బ్యాంకు ఖాతాల్లో జమచేయకుండా సొంతానికి వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఆ మొత్తాన్ని సకాలంలో చెల్లించకపోవడంతో సంఘాల పేరుమీద లోన్ ఖాతాల్లో బకాయిలు పేరుకుపోయినట్లు బహిర్గతం అవుతోంది. ఇల్లెందు పట్టణంలోనూ పలు సంఘాలకు సంబంధించి ఇలాగే బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. లోను ఖాతాల బకాయిలు, రుణ వాయిదా మొత్తాల స్వాహాపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుపై ఇటీవల మున్సిపల్, మెప్మా అధికారులు విచారించారు. సుమారు 40 సంఘాలకు సంబంధించి రూ.40 లక్షలను రికవరీ చేయాల్సి ఉందని గుర్తించారు. ఆయా బాధ్యులకు రెణ్నెల్ల సమయం ఇచ్చినట్లు సమాచారం. సుమారు మూడేళ్ల కాలానికి సంబంధించి నగదు జమ చేయకుండా వాడుకున్నట్లు తేలగా.. ఈ అంశంపై పూర్తి స్థాయిలో నిగ్గు తేల్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే జరిగిన బదిలీలు చర్చకు తెరలేపాయి.

తాజా బదిలీలపై పురపాలక కమిషనర్ యాదగిరిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిపాలనాపరమైన అంశాల నేపథ్యంలోనే మెప్మాలో సిబ్బంది బదిలీలు జరిగాయని చెప్పారు.

నష్ట పరిహారానికి బాధిత రైతుల పట్టు

సుజాతనగర్, న్యూస్‌టుడే: 'ఎంటీయూ-1262' రకం వరి నాటడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విత్తన దుకాణం వద్ద ఆందోళనకు దిగిన ఘటన బుధవారం సుజాతనగర్‌లో చోటుచేసుకుంది. సుజాతనగర్, చంద్రుగొండ మండలాల రైతులు మాట్లాడుతూ.. పంట కాలపరిమితి 160 రోజులు కాగా వంద రోజుల్లోనే కోతకు రావడంతో దిగుబడి తగ్గిందన్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయగా వారితో పాటు కేవీకే శాస్త్రవేత్తలు పైర్లను పరిశీలించారని తెలిపారు. ఎకరాకు 10 నుంచి 15 బస్తాల దిగుబడి తగ్గుతుందని వాపోయారు. దీంతో విత్తన కంపెనీ ప్రతినిధులు రైతులతో వెంటనే సంప్రదింపులు జరిపారు. ఏవో నర్మదను వివరణ కోరగా.. బాధిత రైతుల పొలాలను పరిశీలించి అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు.



సుజాతనగర్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలు